క్లుప్తంగా

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

బాలాజీచెరువు: స్థానిక శ్రీప్రకాష్ పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఇందులో భాగంగా విద్యార్థులకు శ్లోకాలు పాడటం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, స్విమ్మింగ్ వంటి పలు విభాగాల్లో శిక్షణ ఇచ్చారు. రైస్ డ్యాన్స్, రోజ్, శానిటైజర్ తయారీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 6, 7 తరగతుల విద్యార్థులు రూపొందించిన 2డీ వీడియో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్, ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ ఎన్ మూర్తి పాల్గొని సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు



బాటసారులకు మజ్జిగ అందజేస్తున్న బంగారి నవ్యపద్మ

బోట్‌క్లబ్: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల కారణంగా బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు శ్రీచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బంగారి నవ్యపద్మ అన్నారు. స్థానిక ఆర్‌టీఓ రోడ్డు డీమార్ట్ సెంటర్‌లో శ్రీచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. నిత్యం వందలాది మంది తిరిగే ఈ ప్రాంతంలో దాతల సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ విల్లూ రవి చరణ్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు హన్వ్యాష్‌కుమార్, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి, మన్నె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మెప్మా ఆర్పీల శిక్షణ

సామర్లకోట: మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి మెప్మాలో పని చేస్తున్న రిసోర్సుపర్సన్లకు రెండు రోజుల శిక్షణ ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా స్థానిక టీటీడీసీలో సోమ, మంగళవారాల్లో సామర్లకోట మున్సిపాలిటీ మెప్మాలో పని చేస్తున్న 43 మంది ఆర్పీలకు శిక్షణ ఇవ్వనున్నారు. 17, 18 తేదీల్లో తునిలో 40 మందికి, 19, 20 తేదీలల్లో పిఠాపురంలో 39 మందికి, 22, 23 తేదీల్లో రామచంద్రపురంలోని 36 మంది ఆర్పీలకు శిక్షణ ఇవ్వనున్నట్టు డీపీఎం మోహన్‌కుమార్ తెలిపారు. 24 నుంచి జూన్ ఒకటి వరకు కాకినాడ కార్పొరేషన్ నుంచి 209 మంది మెప్మా ఆర్పీలకు శిక్షణ ఉంటుందన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం

పిఠాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజల మనసులను దోచుకున్నారని, అందుకే ప్రతీ ఒక్కరూ పార్టీ లో చేరేందుకు ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం కొడవలిలో ఆదివారం గ్రామానికి చెందిన యువకులు వైఎస్సార్ సీపీలో చేరగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో యువతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర యువజన విభాగం ద్వారా పార్టీలో యువతకు చోటు కల్పించి వారి సేవలను వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. విద్య ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం ముందుండడంతో యువత ఎక్కువగా పార్టీ వైపు మొగ్గు చూపుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో యువత పార్టీ గెలుపునకు కృషి చేసే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొడవలి సర్పంచ్ నాగ రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు భగవాన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన యువత పిల్లి లోవరాజు, పిల్లి రాంబాబు, పాలిక సురేష్, నొట్ల నాగు, కొప్పిశెట్టి వీరబాబు, బొండల వసంత, గంటా అప్పన్న, బుర్రా సోమరాజు, బుర్రా వెంకట్‌తో పాటు సుమారు 50 మంది యువకులు పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అన్ని వర్గాలకు మేలు చేసేదిగా ఉండడంతో ఆయన ఆధ్వర్యంలో ప్రజా సేవలో ఉండాలని తామంతా వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు పార్టీలో చేరిన యువకులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

తొండంగి: మండలంలోని నర్సిపేటకు చెందిన మహిళ విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్సై రవికుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నర్సిపేటకు చెందిన పోలవరపు నాగమణి(52) శనివారం ఇంటి వద్ద చేతిపంపు కొట్టేందుకు వెళ్లింది. విద్యుత్ మోటారు కూడా చేతిపంపునకు అమర్చి ఉండటంతో నాగమణి విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నాగమణి కుమారుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ వివరించారు.

స్వచ్ఛమేవ జయతే..

- ఖాళీ స్థలాల్లో చెత్త తొలగింపునకు చర్యలు
- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్



స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ఖాళీ స్థలంలో చెత్త తొలగింపు పనులు

కాకినాడ సిటీ: చెత్త సమస్యకు చెక్ పెట్టేందుకు ఇప్పటికే కాకినాడ నగరపాలక సంస్థ అనేక చర్యలు తీసుకుంటోంది.. స్వచ్ఛత దిశగా నగరాన్ని తీసుకెళ్లేందుకు బాటలు వేస్తోంది.. ఇందులో భాగంగా పారిశుధ్య విభాగానికి నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. ఇప్పుడు ఖాళీ స్థలాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కాకినాడ వెంకట్‌నగర్ ప్రాంతంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు పాల్గొని పర్యవేక్షించారు. నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాల్లో స్థానికులు, పరిసర ప్రాంతాల ప్రజలు చెత్తను వేయడంతో ఆ స్థలాలు డంపింగ్ యార్డుల్లా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. కాలనీల సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు వైడీ రామారావు, మాజీ కార్పొరేటర్ కంపర బాబి, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెత్త వేస్తే చర్యలు

చెత్తను ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు ఇవ్వకుండా దగ్గరలోని ఖాళీ స్థలాల్లో వేసే వారికి నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు హెచ్చరించారు. కొందరు వ్యక్తులు, స్థల యజమానుల నిర్లక్ష్య వైఖరితో చెత్త పేరుకుపోయి పందులు, కుక్కలు, పాములు, దోమలు చేరి ప్రజారోగ్యానికి భంగంగా మారుతోందన్నారు. అటువంటి స్థలాల్లో స్పెషల్ శానిటేషన్‌కు అయ్యే ఖర్చును, స్థల యజమానులపై, చెత్తను వేసే వారి నుంచి వసూలు చేస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాకినాడ నగరంలో గుర్తించిన నాలుగు వేల ఖాళీ స్థలాలకు సంబంధించి 780 స్థలాల్లో చెత్త అధికంగా పేరుకుపోయినట్లు గుర్తించామని ఏడీసీ వివరించారు. ఇప్పటికే 70 స్థలాలను శుభ్రం చేయించామని, మిగిలిన స్థలాల్లో కూడా ప్రతి ఆదివారం ఈ డ్రైవ్ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కాలనీల సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు వైడీ రామారావు మాట్లాడుతూ ప్రజలు కూడా సహకరించినప్పుడే స్మార్ట్ సిటీకి అర్థం ఉంటుందన్నారు. లేకుంటే ప్రయోజనం ఉండదన్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్, ఆల్ ఈజీవెల్ ప్రతినిధి కిశోర్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలాని, రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అధికారుల ర్యాలీ

వికసించిన మే పుష్పం



కరప: సాధారణంగా కాలాలను బట్టి పండ్లు, పువ్వులు వస్తుంటాయి. వేసవిలో మామిడి పండ్లు, తాటిముంజులు, మల్లె పూలు, వర్షాకాలంలో సీతాఫలాలు, తాటి పండ్లు వస్తాయి. కాలాలతో నిమిత్తం లేకుండా ఇంగ్లిషు నెలను బట్టి పుష్పించేది ఒక 'మే' పుష్పం ఒకటే. కరప మండలం చినకొత్తూరులోని వైఎస్సార్ సీపీ నాయకుడు చోడిశెట్టి సత్యనారాయణ (చంటి) గృహంలోని కుండీలో మే పుష్పం వికసించింది. ఏటా మే నెల చివరి వారంలో ఇది వికసిస్తుందని, ఈ ఏడాది రెండో వారంలోనే వచ్చినట్టు ఆయన చెప్పారు.

30 వసంతాల ముచ్చట్లివి..!



కరప హైస్కూల్‌లో సమావేశమైన విద్యార్థులు, ఉపాధ్యాయులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. 30 వసంతాలు తర్వాత కలుసుకున్నవారు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి బ్యాచ్ విద్యార్థులు 11 మంది కమిటీగా ఏర్పడి 1175 మంది విద్యార్థుల చిరునామాలు సేకరించి, వారికి సమాచారం అందించి అందరూ కలిసేలా ఏర్పాటు చేశారు. అందులో 120 మంది భార్యా, భర్తలు, పిల్లలతో కలసి వచ్చారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఆనాటి 14 మంది గురువులను సత్కరించి, మొక్కలను, దుస్తులను అందజేసి గురుభక్తిని చాటుకున్నారు. ఈసందర్భంగా పూర్వవిద్యార్థులు బాల్యమిత్రుల ట్రస్ట్‌ను ఏర్పాటుచేసుకున్నారు. ఈ ట్రస్ట్ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన తమ బ్యాచ్‌కు చెందిన వారికి ఆర్థికసాయం చేయాలని నిర్ణయించుకున్నారు. హైస్కూలు ఆవరణలోని నక్కా సూర్యనారాయణమూర్తి, అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద విగ్రహాలకు నివాళులర్పించారు.

మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే కన్నబాబు
- కరపలో గడప గడపకూ మన ప్రభుత్వం



కరపలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: మండల కేంద్రమైన కరప గ్రామంలో మౌలిక వసతులన్నీ కల్పించి, అన్నివిధాలా అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో ఉన్నామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మూడోరోజు కరపలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎవరికి ఏయే పథకాల ద్వారా ఎంతమేర లబ్ధి చేకూరిందో వివరించారు. నేను మీ ఎమ్మెల్యే కన్నబాబును ఇళ్ల స్థలం వచ్చిందా, పింఛన్ వస్తుందా, ఎవరికి ఏ సమస్య ఉన్నా చెప్పండి, మీ సమస్యలు పరిష్కరించి, మీ ఆశీర్వాదం కోరేందుకు సీఎం జగన్ పంపించారంటూ ప్రజలకు తెలిపారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ కరపలో 5,350 మందికి ఇళ్లస్థలాల పట్టాలిచ్చామని, గృహాలు నిర్మించేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. గ్రామంలోని గ్రామదేవత, శివాలయం ఆధునీకరణకు నిధులిచ్చామన్నారు. శ్మశానం అభివృద్ధి చేశామన్నారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించడం జరిగిందన్నారు. గ్రామస్తుల వినతి మేరకు రక్షిత మంచి నీటి చెరువుచుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నామన్నారు. ఇంటింటి కుళాయి పథకానికి రెండో మంచినీటి ట్యాంక్ నిర్మిస్తున్నామన్నారు. పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపి, ఇంకా ప్రజల అవసరాలు గుర్తించి వాటిని కూడా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముందుగా వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీటీసీ మద్దూరి గంగాభవాని, ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, గ్రామ కార్యదర్శి వి.సునీల్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు స్వాగతం పలకగా, దుర్గాదేవి ఆలయంలో పూజలు చేసి, ఎమ్మెల్యే కార్యక్రమం ప్రారంభించారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పార్టీ నాయకులు సాదే లోహిదాస్‌కుమార్, పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం



అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో తల్లులకు వస్త్రాలు అందజేస్తున్న పిల్లలు



అచ్చంపేట జంక్షన్ వద్ద వేడుకలో ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామ పరిధిలో అచ్చంపేట జంక్షన్ వద్ద మదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తదితరులు కేక్ కట్ చేశారు. మహిళా నేతలకు నాయకులు మదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడబాల రత్నప్రసాద్ పిల్లలతో తల్లులకు బహుమతిగా నూతన వస్త్రాలను ఇప్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది పెండెం శ్రీదేవి హాజరై మాట్లాడుతూ పిల్లల ఉన్నతికి నిరంతరం తపించే త్యాగమూర్తి తల్లి అని అన్నారు. డాక్టర్ వెంకటరమణ, డాక్టరు కుమార్ యాదవ్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, శ్రీనగేష్, రెడ్నం రాజా, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంచు వేసవి!



ఉదయం 5.30 గంటలకు పరచుకున్న మంచు పరదా



మధ్యాహ్నం 2 గంటలకు నిర్మానుష్యంగా కాకినాడ-రామచంద్రపురం రహదారి

కరప: ఉదయం 5.30 గంటల వరకు మంచుదుప్పటి.. 10 గంటల నుంచే వేసవితాపం.. మధ్యాహ్నం వడగాడ్పులు.. విభిన్న వాతావరణ పరిస్థితులు ప్రజలను కొంత విస్మయానికి, కొంత ఆందోళనకు గురిచేశాయి. రెండు రోజులుగా ఉదయం మంచు తెరలు బాల భానుడిని కప్పేస్తుంటే.. హమ్మయ్య.. ఈ రోజు చల్లగా ఉంటుందిలే అని సంతోషించే లోపే పొద్దెక్కే కొద్దీ ఉష్ణోగ్రతలు తీవ్రమై ఆపాదమస్తకం సెగలు పుట్టించేస్తున్నాయి. ఈ విభిన్న పరిస్థితులతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు అల్లాడుతున్నారు. నిజకర్తరి ఎండలతో ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. మండు వేసవిలో మంచు కురవడం ఈ ఏడాదే చూస్తున్నామని వృద్ధులు అంటున్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో విచిత్ర వాతావరణం నెలకొంది.

సాగర తీరానికి పోటెత్తిన పర్యాటకులు

కొత్తపల్లి: రోజురోజుకూ ప్రచండభానుడు ఉగ్రరూపం దాల్చడంతో ఎండవేడిమిని భరించలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ క్రమంలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ఉప్పాడ సాగర తీరానికి వెళ్తూ సేద తీరుతున్నారు. తీర ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. మండలం నుంచి వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగరతీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీఐ శ్రీనివాస్, ఎస్సై రామలిగేశ్వరరావు సహా పోలీసులు వాహనాలను క్రమబద్ధీకరించారు. తుని సమీపంలో తలుపులమ్మతల్లి లోవ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు.

భజే వీర హనుమా..



బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో అభయాంజనేయస్వామి



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో హనుమాన్ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

- వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

బోట్‌క్లబ్: భజే వీర హనుమా అంటూ భక్తులు జేజేలు పలికారు.. ఆ స్వామివారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు.. ఆదివారం హనుమజ్జయంతి ఉత్సవాలను కాకినాడ నగర, రూరల్ నియోజకవర్గాల్లో అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి పర్యవేక్షించారు. స్థానిక రిజర్వు పోలీస్ లైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అందంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. మెయిన్ రోడ్డులోని సీతారామ స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ బిక్కిన వెంకటరాయచౌదరి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రామారావుపేట శివాలయంలో ఉన్న, దేవాలయంవీధిలో ఉన్న అభయాంజనేయ స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఎల్‌బీ నగర్‌లోని ఆంజనేయస్వామి వారికి తమలపాకులపై శ్రీరామ నామాలు రాసి పూజ చేశారు. ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహినిలో ఉన్న ఆంజనేయస్వామి వారి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. కొండయ్యపాలెం తదితర ఆలయాల్లో వేడుకలు జరిగాయి.

కరప: మండలంలోని కరప, వేములవాడ, యండమూరు, ఉప్పలంక, అరట్లకట్ట, నడకుదురు, వలసపాకల, పేపకాయలపాలెం తదితర గ్రామాల్లోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అరట్లకట్టలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగి ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి సింధూర, నాగవల్లి, తులసి పత్రాలతో సహస్ర నామార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. నడకుదురు ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు పూజాధికాలు చేపట్టారు. కరప జ్యోతిషాలయంలో సువర్చలా సహిత పంచముఖేశ్వరస్వామికి గాదావర్ముల కొండయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ శారదాపీఠం జిల్లా కన్వీనర్ చాగంటి సూరిబాబు పాల్గొన్నారు. కరప విష్ణాలయంలోని అభయాంజనేయస్వామికి ఈఓ వడ్డాది సత్తిబాబుల పర్యవేక్షణలో అర్చకులు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణలు పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం వద్ద ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరులు అర్చన, హోమం నిర్వహించి, స్వామివారికి దివ్య కల్యాణం జరిపించారు. వలసపాకల, వేళంగి గ్రామాల్లోని అభయాంజనేయ స్వామివారి విగ్రహాల వద్ద పూజలు చేశారు.



కరపలో అభయాంజనేయ స్వామివారి దివ్య కల్యాణానికి ముందు హోమ క్రతువు

కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్: హనుమజ్జయంతిని ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఆంజనేయ స్వామి విగ్రహానికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో ఆంజనేయ స్వామి విగ్రహానికి అర్చకుడు పవన్ అభిషేకాలు నిర్వహించారు. మహిళలు హనుమాన్ భక్తి గీతాలను ఆలపించారు. సూర్యారావుపేటలో పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, వాకలపూడి ఏడీబీ రోడ్డు వద్ద హనుమాన్ ఆలయం, పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సత్కళావాహినిలో..

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలోని సత్య భాస్కర ప్రసన్నాంజనేయ స్వామి భజన మందిరంలో ఆదివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పంచామృత అభిషేకం చేశారు. సంస్థ అధ్యక్షుడు గోపాల నర్సరాజు, కలగా శివరాణి, రాయవరపు సత్యభామ, కుంజుక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక కొండయ్య పాలెంలోని ఆభయ ఆంజనేయ ఆలయంలో హనుమన్ జయంతి వేడుకలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



సత్కళావాహినిలో హనుమాన్ జయంతి నిర్వహిస్తున్న సభ్యులు



వలసపాకలలోని అభయాంజనేయస్వామి దర్శనానికి వేచిఉన్న భక్తులు